క్లుప్తంగా

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రతి ఒక్కరూ కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని, కంటి చూపుకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణా రావు సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్యశాలకు చెందిన వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 176 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మరో 26 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో ఆర్జిత కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించారు. విజయవాడకు చెందిన గన్నవరపు శ్రీనివాస్, మాధవి దంపతులు ఆర్జిత కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపములో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

పారిజాతగిరికి లక్ష విరాళం

కొయ్యలగూడెం : జంగారెడ్డిగూడెం పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు కొయ్యలగూడెం పీఏసీఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు పేర్కొన్నారు. ఆదివారం దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులను కలుసుకుని లక్ష రూపాయలను అందజేసినట్లు ఆయన తెలిపారు.

చింతాలమ్మకు జలాభిషేకం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామ దేవత చింతాలమ్మ అమ్మవారికి ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళా భక్తులు పారాణి, పసుపు నీళ్లు, వేప ఆకులను కలిపిన జలాలను అమ్మవారి మూల విరాట్ విగ్రహంతో పాటు, కలశానికి పోస్తూ చింతాలమ్మ శరణుఘోష చేశారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

వలంటీర్లకు వందనం

ఏలూరు రూరల్ : ఏలూరు మండల గ్రామాల్లో వలంటీర్ల సేవకు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర మరువలేమంటున్నారు. నీతి, నిజాయితీగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయిస్తున్నారని కొనియాడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ అందించి ఆదుకుంటున్నారని చెబుతున్నారు. కరోనా కష్టకాలంలో వైద్య పరీక్షలు చేయించారని, క్వారంటైన్ సమయంలో నిత్యవసర సరుకులు అందించి ఆపద్బాంధువులయ్యారని గుర్తు చేస్తున్నారు. పార్టీ, కుల, మత, వర్గ భేదాలు లేకుండా వలంటీర్లు చేస్తున్న సేవలను వెలకట్టలేం అంటున్నారు.



25వ డివిజన్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీర్



చొదిమెళ్లలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

వలంటీర్ వ్యవస్థ గొప్పది



వలంటీర్ వ్యవస్థ లాంటి గొప్ప వ్యవస్థ దేశంలోనే ఎక్కడా లేదు. పాలనలో ఎక్కడా అవినీతి జరగకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిజాయితీ కల్గిన యువతీ, యువకులతో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. గతంలో మాదిరిగా పథకాల కోసం అందరి చుట్టూ తిరగాల్సిన పని లేదు. వలంటీర్‌నే ఇంటికి పంపించి అర్హులను గుర్తిస్తున్నారు. ఇది దేశానికే గొప్ప వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థల వల్లనే అవినీతి అంతం చేయవచ్చు. వలంటీర్ సేవలు తప్పు పట్టలేం. – జయమంగళ ప్రభావతి, సర్పంచ్, గుడివాకలంక

మా కుటుంబ సభ్యుడిలా....



వలంటీర్ మా కుటుంబ సభ్యుడిగానే భావిస్తాను. ప్రభుత్వం ఏ పథకం పెట్టినా ముందుగా వచ్చి మా కుటుంబానికి చెబుతాడు. వలంటీర్ వల్లనే మాకు ఇంటి స్థలం వచ్చింది, ప్రతి నెలా 1వ తేదీనే ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తాడు. నాలాంటి వృద్ధుడికి ఇంతకన్నా ఏం కావాలి. ఇంతకు ముందు పింఛన్ కోసం స్కూల్ వద్ద పడిగాపులు పడేవాళ్లం. పొద్దున్న వెళ్లితే సాయంత్రం అయ్యేది. ఇప్పుడు అలా లేదు. ఇంటి వద్ద వేలిముద్ర వేసుకుని ఇచ్చేస్తున్నారు.

– ఎం.చిన్నబ్రహ్మయ్య, చొదిమెళ్ల

ప్రాణాలకు తెగించి..



కరోనా రోజుల్లో పైసా తీసుకోకుండా సాయం చేసే వారు ఎవ్వరున్నారో చెప్పండి. మా వలంటీర్ కరోనాలో ఇంటింటికీ తిరిగి జ్వరం ఉందా, లేదా అని పరీక్షలు చేయించాడు. మందులు ఇప్పించాడు. కూరగాయలు, తాగునీరు అందించారు. ఎంత డబ్బు ఇచ్చినా సాయం చేసేవాళ్లే లేరు. అలాంటిది ప్రాణాలకు తెగించి సాయం చేశాడు. ఇప్పుడు పథకాలు అన్నీ ఇస్తున్నాడు. కష్టకాలంలో అదుకున్న వాళ్లే బంధువులు. వలంటీర్ బంధువు లాంటి వాడే. – కె.విజయలక్ష్మి, ఏలూరు

వలంటీర్ దేవుడిచ్చిన బిడ్డ



నాకు వలంటీర్ దేవుడిచ్చిన బిడ్డ. కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియదు. ఎవరికి చెప్పినా పట్టించుకోరు. మా వలంటీర్ నా సమస్యలన్నీ వింటాడు. ప్రతి నెలా నా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. ఒక్కరూపాయి తేడా లేకుండా పింఛన్ డబ్బులు ఇచ్చేస్తున్నాడు. ఇలా ఎవ్వరు ఇస్తారు చెప్పండి. వలంటీర్ లేకపోతే నాలాంటి వృద్ధులు, పేదవాళ్ల కష్టాలు పట్టించుకునే నాథుడే ఉండడు.

– జి.రాజమ్మ, ప్రత్తికోళ్లలంక

గిరిప్రదక్షిణ రోడ్డులో ఖర్జూరం మొక్కలు



ఖర్జూరం మొక్కలు నాటుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి అలయ గిరి ప్రదక్షిణ రోడ్డులో ఖర్జూరం మొక్కలు ఆదివారం నాటారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు మాట్లాడుతూ కమిటీ ఆర్థిక సహకారంతో 190 ఖర్జూరపు మొక్కలు కొనుగోలు చేశామన్నారు. వీటిని గిరిప్రదక్షిణ రోడ్డులో నాటుతున్నట్లు తెలిపారు. తొలి మొక్కను ఆలయ ఈవో మానికల రాంబాబు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ది మోటార్ ఫీల్డ్ వర్కర్స్ ఓనర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో రాజాని తారక శ్రీనివాసరావు నాయుడు, నడిపిన నర్సింహరావు, కృష్ణ, జశ్వంత్, కోటా అప్పారావు, సీతారాము, అంజి తదితరులు పాల్గొన్నారు

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



గంజాయి కేసుల్లో నిందితులకు కౌన్సిలింగ్ ఇస్తోన్న ఏలూరు త్రీటౌన్ సీఐ శివాజీ

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో గంజాయి రవాణా, విక్రయాలు చేస్తే తాట తీస్తానని ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిత్యం గంజాయి విక్రయాలు, రవాణాపై నిఘా ఉంటుందన్నారు. ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో ఆదివారం గంజాయి కేసుల్లో నిందితులు, గంజాయి తాగేవారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ మాట్లాడుతూ ఏలూరు త్రీటౌన్ పరిధిలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు, యువతకు గంజాయిని అలవాటు చేస్తూ వ్యాపారం చేసే వ్యక్తులపైనా నిఘా ఉందన్నారు. గంజాయి తాగినా సహించేదిలేదనీ, మీ ప్రవర్తనలో మార్పు రావాలని సీఐ సూచించారు. గంజాయి తాగటం వల్ల యువత తన శక్తిసామర్థ్యాలను కోల్పోతారని, మానసిక వత్తిడితో, గంజాయికు బానిసలుగా మారి భవిష్యత్తు నాశనం అవుతుందని హితవు పలికారు. తమ పిల్లల ప్రవర్తనపై ప్రతి తల్లిదండ్రి పర్యవేక్షణ ఉండాలనీ, కళాశాలలకు వెళ్లే విద్యార్థులను నిత్యం పరిశీలిస్తూ ఉండాలని సీఐ శివాజీ కోరారు.

నంది అవార్డుల ప్రకటనపై హర్షం



ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలరావుతో నాటకరంగ కళాపరిషత్ సభ్యులు

కొయ్యలగూడెం : రంగస్థలానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రభుత్వంచే నంది అవార్డు ప్రకటన నాటక రంగ కళాకారులకు ఊపిరులు ఊదినట్లు అయ్యిందని నాటక రంగ కళాపరిషత్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లిలోని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలరావు కార్యాలయంలో కలుసుకుని ప్రభుత్వానికి నాటక కళాకారుల తరుపున కృతజ్ఞతలు తెలిపి సత్కరించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఐదు నాటిక పోటీలతో పాటు మొత్తం 73 నంది అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నామన్నారు. కనుమరుగవుతున్న పద్య, సాంఘిక, నాటకాల పూర్వ వైభవానికి ప్రభుత్వం కృషిచేయడం హర్షణీయం అని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నాటక కళారంగానికి అందించాల్సిన నంది అవార్డులను విస్మరించిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాటక రంగ నంది అవార్డు గ్రహీతలు ఎంపీ రాజర్షి, నాగభట్ల రఘు, ఉమా శంకర్, లోవరాజు, మణికంఠ ఆర్ట్స్ పిఠాపురం సమాజం, కొండేవరం నాటక రంగ కళా పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

కాపునేస్తం పథకానికి దరఖాస్తులు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో కాపు నేస్తం పథకం మంజూరుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత పోకల రాంబాబు అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో కాపునేస్తం పథకంలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన అర్హులైన ప్రతి మహిళ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న కాపు నేస్తంలో ఇస్తున్న రూ.15 వేలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అన్ని గ్రామాల్లో కాపు సంఘం నేతలు, కాపు యువతతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులందరూ వైఎస్సార్ కాపునేస్తం పథకానికి అర్హులందరూ దరఖాస్తులు చేసుకునేలా తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. 45–60 ఏళ్లలోపు వయస్సున్న మహిళలు ఈ పథకానికి అర్హులన్నారు. కుటుంబం మొత్తానికి ఫోర్‌వీలర్స్ ఉండకూడదన్నారు. అర్హులైన మహిళలు తమ దరఖాస్తులను ఆధార్‌కార్డు, వయస్సు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను సచివాలయంలో అందించి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. కాపు, బలిజ, ఒంటరి, తెలగ, కులాలకు చెందిన మహిళలకు ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి కల్పించడం ద్వారా జీవన విధానం మెరుగుపరిచి శాశ్వత భద్రత కల్పించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ కాపునేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారని పోకల రాంబాబు అన్నారు.

ప్రభుత్వం తరఫున ఆదుకుంటాం

దీనస్థితిలో ఉన్న బాలికలకు కలెక్టర్, ఎమ్మెల్యే భరోసా



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు బాలికల దుస్థితిని వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : ఆ బాలికలు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. ఆ తరువాత కోవిడ్ మహమ్మారి కారణంగా తండ్రిని కూడా పోగొట్టుకున్నారు. మానసిక వైకల్యం కలవారు కావడంతో ఆ బాలికలను మారుటతల్లి విడిచిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆ పిల్లల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అయితే ప్రభుత్వం తరఫున ఆదుకోవడానికి మేమున్నామంటూ, మండలంలోని తిమ్మాపురంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆ బాలికలకు భరోసానిచ్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని జాజుల కుంటకు చెందిన పెనుమాల మధు, లక్ష్మి దంపతులకు ప్రవల్లిక, మౌళిక సంతానం. వీరు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. వారి చిన్నతనంలోనే తల్లి లక్ష్మి మృతి చెందడంతో తండ్రి మధు స్వాతి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. అయితే మధు రెండేళ్ల క్రితం కోవిడ్‌తో మృతి చెందాడు. దాంతో స్వాతి పిల్లలను విడిచిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బాలికలిద్దరూ వారి తాత వద్దే ఉంటున్నారు. ప్రస్తుతం ఆయనకు వీరి పోషణ కష్టతరం కావడంతో, స్థానికులు ఆ బాలికలను తీసుకెళ్లి ముందు ఎమ్మెల్యే తలారిని కలసి విషయాన్ని తెలిపారు. దాంతో చలించిపోయిన ఆయన ఆ బాలికల దుస్థితిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వివరించారు. అనంతరం బాలికలను ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు.

మండలానికి సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు

దెందులూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 13,203 సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయని మండల విద్యాశాఖాధికారి ఎ.ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు ఎంఈఓ కార్యాలయానికి చేరాయని తెలిపారు. రెండు రోజుల్లో పౌరసరఫరాల శాఖ వాహనాల ద్వారా ద్వారా నేరుగా పుస్తకాలను పాఠశాలలకు తీసుకువెళ్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సమక్షంలో విద్యార్థులకు అందజేస్తామని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	100	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	92	బీట్‌రూట్	40
కాకర కాయలు	54	కీరా దోస	40
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	188-260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	22	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-34	బఠాణీ	--
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	104
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

ప్రవక్తల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఐవైఎం ఏలూరు నగరశాఖ నూతన కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రవక్తల జీవితాలను యువత అధ్యయనం చేసి వారిని ఆదర్శంగా తీసుకొని జీవితం గడిపితే ఇహ పరలోకాల సాఫల్యం లభిస్తుందని ఐడియల్ యూత్ మూమెంట్ (ఐవైఎం) రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ కలీం ఖాన్ అన్నారు. సంస్థ రాష్ట్ర వ్యాప్త కమిటీల ఎన్నికల పర్యటనలో భాగంగా ఆదివారం స్థానిక తంగెళ్ళమూడి నెహర్ మసీదులో ఐవైఎం ఏలూరు శాఖ ఎన్నికలు కలీం అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పలు చెడు వ్యసనాల్లో కూరుకుపోయి ఉన్నారని, వాటి నుంచి వారిని బయటికి తీసుకు రావాలంటే ప్రవక్తలు గడిపిన జీవిత విధానాన్ని తెలుసుకొని ఆచరించాలన్నారు. దైవాన్ని అనుసరించిన ప్రవక్తలు చెడులకు దూరంగా ఉండి ప్రజలను వాటి నుంచి దూరంగా ఉంచడంలో సఫలీకృతులయ్యారన్నారు. ఈ సందర్భంగా ఏలూరు నగరశాఖ ఎన్నిక నిర్వహించారు. ఐవైఎం నగర అధ్యక్షులుగా ఎస్‌కే ఖాదర్ భాష, సెక్రటరీగా ఎస్‌కే రఫీ, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కే బాబ్జి, ట్రెజరర్‌గా మునీర్ ఖాన్, సభ్యులుగా పఠాన్ నజీముల్లా, ఎస్‌కే సైదు, ఎస్‌కే షఫీఉల్లా, ఎండీ ఖాన్, ఎండీ సిరాజ్, ఎండీ బషీర్, ఎండీ అలీమ్, ఎస్‌కే ఆసిఫ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ జునైద్, జమాతే ఇస్లామీ హింద్ ఏలూరు నగర అధ్యక్షుడు మొహమ్మద్ ఇబ్రహీం, సభ్యులు మహమ్మద్ ముజాహిద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతి పరిరక్షణ కమిటీలు

నేర సమీక్షలో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్ : ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, విధుల్లో అలసత్వాన్ని సహించబోమని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు అన్నారు. ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన ఆదివారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ఆయా సర్కిళ్ల వారీగా కేసుల నమోదు, పెండింగ్ కేసులు, విచారణ దశలో ఉన్న కేసులు, కోర్టుల్లో ఛార్జిషీట్లు దాఖలు, నాన్ బెయిలబుల్ వారెంట్లపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ చోరీలను నివారించేందుకు, నేరాలను అదుపు చేసేందుకు రాత్రి, పగలు గస్తీని మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. బస్టాండ్, ప్రధాన కూడళ్లు, కళాశాలల వద్ద బాలికలు, యువతులను అల్లరిమూకలు వేధించకుండా మహిళా కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎస్పీ చెప్పారు. ఈ నేర సమీక్షలో కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు, భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు ఉన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



డీఎస్ఈఓను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి.శ్యామ్ సుందర్‌ను ఆదివారం వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట ఎడ్వర్డ్, నాయకులు మాట్లాడుతూ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి నెలా జీతాలు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఎంటీఎస్ ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. దీనిపై శ్యామ్‌సుందర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎస్ఈఓను కలిసిన వారిలో ఎంటీఎస్ ఉపాధ్యాయులు కె.స్వామి దాసు, వల్లూరి వరభూషణ రాజు, కె.సువర్ణ రాజు, ఎస్ఎస్ బాజి, దాసరి ఏసుపాదం, టి.అంజిబాబు, ఎస్.పుష్పలత, పి.కరుణానిధి ఉన్నారు.

నిజం తెలుసుకో మద్దిపాటి

- ఆ తరువాత ధర్నాలు చేద్దువుగాని
- అనవసరంగా ప్రభుత్వంపై బురదచిమ్మితే చూస్తూ ఊరుకోం
- వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి

ద్వారకాతిరుమల : మద్దిపాటీ.. ముందు నిజం తెలుసుకో, ఆ తరువాత ధర్నాలు చేద్దువుగాని.. మా ప్రభుత్వంపై అనవసరంగా బురదచిమ్మాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి హెచ్చరించారు. మండలంలోని బుట్టాయిగూడెంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన నోముల రాంబాబు పూరి గుడిసెకు రూ. 26,660 విద్యుత్ బిల్లు వచ్చిందంటూ ఈనెల 13న రాత్రి గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, పాత విద్యుత్ బిల్లును పట్టుకుని ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిల్లు ఎక్కువ వచ్చిందనగానే దానిపై తేదీ కూడా చూడకుండా హడావిడిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదచిమ్మేందుకు ఆయన ప్రయత్నం చేశారని, చివరకు ఆయనే అబాసు పాలయ్యారని అన్నారు. సొంత పార్టీలో ఆయనను వ్యతిరేకిస్తున్న ప్రత్యర్థి వర్గంపై పైచేయి సాధించాలన్న ఉద్దేశ్యంతోనే ఇలాంటివి చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాంబాబుకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చింది మీ నాయకుడు చంద్రబాబు కాదని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆమె గుర్తు చేశారు. రాంబాబు విద్యుత్ సర్వీస్‌కు సంబంధించిన ఆన్‌లైన్ హిస్టరీలో ప్రస్తుతం పాత బకాయి రూ. 10,268 చూపిస్తోందని, అది మీకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ నేతల అక్కసును, అక్రమాలను భయటపెడుతున్న సాక్షి పత్రిక, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాపై సైతం మద్దిపాటి విషం కక్కుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముందు పాత విద్యుత్ బిల్లులను పట్టుకుని తిరగడం మాని, ప్రజలకు మీరేం చేస్తారో చెప్పాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంతేటి గంగయ్య, దార్శిన ప్రకాష్, తోట స్వాతి, బెజవాడ మరియమ్మ, పెండ్యాల మార్త, వంగలపూడి విజయ, పులపాకుల కృష్ణమూర్తి తదితరులున్నారు.